నవ్య వీక్లి - పసుపులేటి లక్ష్మినారాయణ స్మృతిసాహితి కథల పోటీలో

## రూ. 5,000 ద్వితీయ బహుమతి పొందిన కథ


కాలదూరాలు గాలికి గడ్డిపరకల్లా కొట్టుకుపోయాయి కదా! అమెరికా అంతర్వేదిపాలేనికి శివారుపల్లె కన్న చేరువై పోయింది కదా! ఉదయం ఆరు గంటలవేళ - బంజారాహిల్స్‌లోని నా బంగళాలో సిస్టమ్ ముందు కూర్చుని అమెరికాలోని కొడుకూ కోడళ్ళను, మనవడిని మానిటర్లో చూస్తూ మాట్లాడుతున్నాను.

''ఎలా ఉన్నారు డాడీ? మమ్మీ ఎలా ఉంది?'' సందీప్ అడుగుతున్నాడు.

''బాగానే ఉన్నాంరా! మీరెలా ఉన్నారు?''

# అసలైన వేకువ

వి-రాగి



''ఇదిగో ఇప్పుడే ఇద్దరం ఆఫీసుల నుంచొచ్చాం. సంజయ్‌ని క్రెష్ నుంచి తీసుకొచ్చాం''

''ఏమ్మా దీప్తీ! చంటాడు నడక నేర్చాడా?''

''ఇప్పుడిప్పుడే గోడలు, సోఫాలు పట్టుకుని నుంచుంటున్నాడు అంకుల్!''

''వాడు పుట్టి ఏడాదవుతోంది. ఇంతవరకు ఒక్కసారి కూడా ఇండియా రాలేదు. వీలు చూసుకుని రారాదూ!''

''నాట్ పాజిబుల్ డాడ్! మీకు తెలియందేముంది. క్రైసిస్ ప్రివైల్స్ ఎవ్రివేర్! జాబ్ మార్కెట్ ఈజ్ గెటింగ్ ఎరోడెడ్ డే బై డే. ఈ సిచ్యుయేషన్‌లో అన్నాళ్లు సెలవు పెట్టి అక్కడికొస్తే - వుయ్ విల్ ఫేస్ టఫ్ డేస్! మీరే వీలు చూసుకుని రావచ్చు కదా!''

నిట్టూర్చాను. ఇద్దరూ కలిసి నెలకు ఇరవైవేల డాలర్లు సంపాదిస్తున్నారు. ఇండియాలో అంతంత జీతాలు కళ్ళజూడగలరా! కళ్ళలో ఆనందం తొణుకుతుండగా పక్కనే నుంచున్న లక్ష్మిని మాట్లాడమన్నాను.

''దీప్తీ! వాడితో మాట్లాడించు వింటాను'' కోడల్ని అడిగింది. తల్లి ఒడిలో గారాలు పోతున్న మనవడిని మానిటర్ మీద చూస్తూ మురిసిపోతోంది లక్ష్మి. సందీప్, దీప్తి మూడేళ్ళ క్రితం పెళ్ళి చేసుకున్న వెంటనే అమెరికా వెళ్ళిపోయారు. ఇద్దరికీ ఉద్యోగాలే. ఏడాది క్రితం అక్కడే పుట్టాడు సంజయ్. వాడుపుట్టగానే అమెరికన్ పౌరసత్వం సంపాదించినందుకు ఇక్కడ పెద్ద పార్టీ కూడా ఇచ్చాను. ఇంతవరకు వాడిని ఫొటోల్లోనూ, వెబ్‌కామ్‌లోనూ చూడడమే. అక్కడికి వెళ్ళడానికి మాకూ, ఇక్కడికి రావడానికి వాళ్ళకూ తీరికే చిక్కలేదు.


''స్పీకవుట్ సంజూ! గ్రాన్ మా, గ్రాన్ మా! గ్రాన్ పా, గ్రాన్ పా!'' కోడలు మనవడితో మాట్లాడించడానికి ప్రయత్నిస్తోంది. మంచు పోగులతో అల్లినట్టున్న తెల్లని స్వెట్టర్‌లో వాడు వెన్నముద్దలా ఉన్నాడు. వాడి బోసినవ్వు నాకున్న బ్లూ ప్ షేర్ల కన్న, బంగారు గుడ్లు పెట్టే బాతుల్లాంటి ప్లాట్ల కన్న అందంగా, అపురూపంగా అనిపించింది.

''గామ్మా! గాప్పా!'' ముద్దముద్దగా వాడి నోటినుంచి వస్తున్న పలుకులు వింటుంటే బుగ్గలు పుణకాలనిపించింది. నా చేతులు అప్రయత్నంగా మానిటర్‌ను తాకాయి. గాజుతెర మీద అతికించిన మందమైన పాలిథిన్ షీట్ గరగరలాడింది. ప్లాస్టిక్ పూలను ముక్కు దగ్గర పెట్టుకున్న పసివాడిని చూసినట్టు నా వంక చూస్తోంది లక్ష్మి.

"బై డాడ్! ఇట్స్ టైమ్ టు టేక్ అవర్ డిన్నర్!"

"గుడ్‌నైట్‌రా! గుడ్‌నైట్ అమ్మా!" నెట్ డిస్కనెక్ట్ చేశాను. తినడం పూర్తికాకుండానే చాక్లెట్ చేజారి దుమ్ములో పడ్డప్పుడు పసిపాపలా లక్ష్మి బెంగగా ఖాళీ మానిటర్‌వైపు చూస్తోంది.

మరో ఏడేళ్ళ సర్వీసుంది నాకు. గోడలూ, బల్లలూ సైతం చేతులు సాచి పుష్కలంగా సంపాదించే ప్రభుత్వశాఖలో నెలకు పాతికవేలొచ్చే ఉద్యోగం. ఉంటున్న బంగళాతో పాటు మాదాపూర్‌లో మరో డూప్లెక్స్ ఇల్లు. అక్కడక్కడా మరో అరడజను ప్లాట్లు. ఓ రెండు వ్యాపారాల్లో పార్టనర్‌షిప్. నగదు, నగలు, వారసత్వంగా వచ్చిన ఆస్తికి వందరెట్లు సంపాదించాను. ఒక కొడుకు, ఒక కూతురు. కొడుకూ, కోడళ్ళకు అమెరికాలో, కూతురూ, అల్లుళ్ళకు ఆస్ట్రేలియాలో ఉద్యోగాలు. చాలామందికి కన్ను కుట్టే సంపద, హోదా, అయినా ఏపుగా పెరిగి పూత పిందె లేని చెట్టులా అనిపిస్తోంది జీవితం. వేసవిలో ధవళేశ్వరం బ్యారేజి దిగువన నదిలోని ఇసుకదిబ్బల్లా తోస్తున్నాయి రోజులు – ఎందుకనో?



"నేను వాకింగ్‌కి వెళ్ళొస్తాను లక్ష్మీ" బయటికి నడిచాను.

***

ఆకాశంలో దట్టంగా మబ్బులు కమ్ముకున్నాయి. ఎక్కడో బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడితే ఇక్కడ బంజారాహిల్స్‌లో ఎండ కనుమరుగవుతుంది. కాలదూరాలు మనిషికి లొంగిపోయాయనుకోవడం భ్రాంతేనా! అంత దూరానున్న కడలి ఇంత దూరానికి చల్లదనాన్నీ, చినుకులనూ ఇస్తుంది. మరి, కాలదూరాలపై మనుషులు సాధించామనుకుంటున్న గెలుపు మా మనవడి లేత బుగ్గల స్పర్శను నా అనుభవానికి తేలేకపోతోందేం? జూబ్లీహిల్స్ వైపు నడక సాగించాను. గాఢనిద్రలో ఉన్న డైనోసార్ ఒంటిమీది పొలుసుల్లా నగరంలోని బహుళ అంతస్తుల భవనాలు. నల్లతాచుల్లాంటి రోడ్లపై అక్కడో చీమల్లా పలచగా జనం.

రోడ్డు పక్కన ఖాళీగా ఉన్న స్థలంలో పెద్ద బండను ఆనుకుని గుడారం. కిరోసిన్ స్టౌపై అన్నం వండుతోంది ఓ మహిళ. పాలమూరు కూలీ కుటుంబమనుకుంటా. గుడారంపై కప్పులా వేర్వేరు రాజకీయ పార్టీలు వేర్వేరు సందర్భాల్లో ప్రదర్శించిన భారీ ఫ్లెక్సీ బ్యానర్లు. నేతలపై పొగడ్తలూ, పేదల ఉద్ధరణకు వారి వాగ్దానాలతో నిండిన అవి ఒకదానితో ఒకటిగా కలిసిపోయి ఒకే తాను ముక్కల్లా ఉన్నాయి. గుడారంలో ముప్పై, ముప్పై అయిదేళ్ళ వయసుండే మగాడు గుర్రు పెడుతున్నాడు. పది, పన్నెండేళ్ళ ఓ అమ్మాయి, అబ్బాయి చెరోవైపు ఆ మగాడిని వాటేసుకుని మీద కాళ్ళేసి నిద్రపోతున్నారు. గుడారం ఇరుకైనందుకో లేక తండ్రికి అంత చేరికో! నా కొడుకూ, కూతురూ గుర్తొచ్చారు. చిన్నప్పట్నుంచీ ఇంట్లో అందరికీ వేర్వేరు గదులే. ఒక్కరాత్రైనా వాళ్లు నన్ను హత్తుకుని పడుకున్న గుర్తే లేదు. వాళ్లు ఇంటర్ నుంచీ హాస్టళ్ళలోనే. ఐఐటీలో సీట్లొచ్చాక రాష్ట్రాన్నే విడిచి పెట్టారు. ఇప్పుడు దేశంలోనే లేరు. ఉన్నట్టుండి నా బంగళా ఆ గుడారం కన్న ఇరుకైనట్టనిపించింది. ఆరుబయటే ఉక్కిరిబిక్కిరిగా అనిపించింది.

***

ఇంటికి తిరిగొస్తుంటే జేబులోని మొబైల్ మోగింది.

"హలో! ఎవరూ?"

"రఘూ! నేనురా – శంకరాన్ని" అవతలి గొంతు ఎవరిదో పోల్చుకోలేకపోయాను. "శంకరమా?"

"వల్లూరు నుంచి మాట్లాడుతున్నానురా! మీ చిన్నాన్నను అడిగితే నీ నంబరిచ్చాడు"

"ఓ నువ్వా? ఎక్కడినుంచి, ఏమిటి విషయం?" అడిగాను. శంకరానిది మా ఊరే. చిన్నప్పుడు నాతో కలిసి చదువుకున్నాడు. హైస్కూలుతోనే చదువు మాని, వ్యవసాయంలో పడ్డాడు. వాడికి ఆ ఊరంటే మక్కువ. వల్లూరును విడిచి వస్తే నీళ్ల నుంచి ఒడ్డున పడ్డట్టుంటుంది అంటాడు. ఇంత పొద్దున్నే చేశాడు – ఏం పనొచ్చిందో?


"రామారావు గాడికి పక్షవాతం వచ్చింది. పరిస్థితి ఏం బాలేదు. నిన్నోసారి చూడాలని కలవరిస్తున్నాడు" చెప్పాడు శంకరం.

రామారావెవరో గుర్తురాలేదు. కొన్ని క్షణాలు ఆలోచించినా స్ఫురించకపోవడంతో అడిగాను – "రామారావు ఎవరు?"

"కోడోడురా. నిన్నెప్పుడూ అంటి పెట్టుకుని ఉండేవాడు. ఇప్పుడు గుర్తొచ్చాడా?"

అవును, రామారావు ఇంటిపేరు కోడి, వాడిని మిత్రులందరం ఇంటిపేరుతో 'కోడోడు' అనే పిలిచేవాళ్ళం. చెట్లెక్కడంలో కోతిని మించేవాడు. ఈతలో చేపను చిన్నబుచ్చేవాడు. కర్రాబిళ్ళాడితే బిళ్ళ ఊరి పొలిమేరల్లో పడాల్సిందే. కబడ్డీ ఆడితే అవతలి జట్టంతా వాటేసుకున్నా అవలీలగా బద్దీ మీదకొచ్చి పడాల్సిందే. వేసవిలో పగలంతా తాటిచెట్ల మీదే వాడి మకాం. మమ్మల్నందర్నీ వెంటేసుకుని గెలలు గెలలు కోసి పెట్టేవాడు. వర్షాకాలం వస్తే రోజూ వాడి నిక్కర్ జేబులు నేరేడు పళ్ళతో నిండిపోయేవి. నేనంటే వాడికి ఎంతో ఇష్టం. ఒకే ఈడైనా నాకన్న ఏపుగా కనిపించే కోడోడు నన్ను తమ్ముడిలా చూసుకునేవాడు. ఏ పండైనా, కాయైనా నాకే ముందు పెట్టేవాడు. నేనేమి కోరినా క్షణాలమీద తీర్చేవాడు. ఆటల్లో నేను తన జట్టే ఉండాలని పట్టుబట్టేవాడు. రాత్రులు ఆకాట ఆడేటప్పుడు మా పల్లెల్లో పెద్దలు సైతం ఒంటరిగా వెళ్లడానికి భయపడే తోపులకు వెళ్ళి ఆకులు కోసుకు వచ్చే సాహసి. చదువులోనూ చురుకే. వాళ్ళకో రెండెకరాల పొలం ఉండేది. వాడి అక్కచెల్లెళ్ళ పెళ్ళిళ్ళకు అది కాస్తా అమ్మేశారు. టౌనుకు పంపి చదివించే ఓపిక లేక అయిదో తరగతితోనే మానిపించాడు వాళ్ళ నాన్న. కోడోడు కూలిపనులకు వెళ్లేవాడు. ఎప్పుడు ఎదురైనా ఆప్యాయంగా నన్ను వాటేసుకునేవాడు. నాకెందుకో వాడి ప్రేమ ఇబ్బందిగా అనిపించేది. పదేళ్ళ క్రితం వల్లూరు వెళ్ళినప్పుడు అది తెలిసి నన్ను చూడడానికి వచ్చాడట. అప్పటికే పొలం రిజిస్ట్రేషన్ పూర్తి కావడంతో నేను హైదరాబాద్ వచ్చేశానని శంకరమే చెప్పాడు. ఆ ఊళ్లో పని పూర్తయ్యే వరకూ ఉండడమే కష్టమైంది నాకు. ఇక పనయ్యాక ఎలా ఉండగలను?

'పాపం, కోడోడికి పక్షవాతం వచ్చిందా! అయితే నన్ను చూడాలనిపించడమేమిటి. వాడిని చిన్నప్పటి 'పిచ్చి' ఇప్పటికీ వదలనట్టుంది.



"శంకరం! నేనొచ్చి చేసేదేముంది?డబ్బేమైనా కావాలనా?" అడిగాను.

"అదేం కాదు – రఘూ! డబ్బు కోసమైతే మేమంతా ఉన్నాంలే. వాడికి నువ్వంటే ఎంత ప్రేమో తెలుసుగా. ఈ చివరి రోజుల్లో చిన్నతనాన్ని నెమరేసుకుంటున్నట్టున్నాడు. బహుశా – వాడి జీవితంలో తియ్యగా గడిచింది చదువు మానేవరకు మనతో గడిపిన కాలమేననుకుంటా. పదే పదే నువ్వే కళ్ళల్లో మెదులుతున్నావంటున్నాడు. కన్నీళ్ళు పెట్టుకుంటున్నాడు. ఎలాగో వీలు చూసుకుని ఓ సారి రా రఘూ!" బతిమాలుతున్నట్టున్నాడు శంకరం.

'ఆ కోడోడంటే ఆరోగ్యం పాడై మనసు స్థిమితం తప్పి ఉండొచ్చు. మరి, ఈ శంకరమేంటి – వాడి మాట పట్టుకుని ఏకంగా నేను వచ్చి తీరాలన్నట్టు మాట్లాడుతున్నాడు. కాకెంగిలి నాటి నేస్తాలు కలకాలం అలాగే ఉండాలనుకోవడం, ఉంటాయనుకోవడం వెర్రి కాక మరేమిటి? జీవితం సగం పైగా గడిచిపోయినా కనీసం ఒకటో ఎక్కం వంటబట్టని తింగరాయల్లా వీళ్ళేమిటి?'

"కుదరదు శంకరం! ఆఫీసులో పెండింగ్ పని చాలా ఉంది"

"అలాగనకు రఘూ! వాడిప్పుడో, కాసేపో అన్నట్టున్నాడు. మనిషి పోతే మళ్ళీ చూడలేం. ఏం చేయాలన్నా చేయగలిగిందీ లేదు. నీకు తెలియకుండా జరిగితే అది వేరు. నువ్వొస్తే చివరి క్షణాల్లో ఆ ప్రాణానికి ఆనందం దక్కుతుంది"

"సరే! రాత్రికి గౌతమీలో బయల్దేరతాను" అయిష్టంగానే అన్నాను. వల్లూరుతో నాకున్న ఒకే ఒక్క లంకె చిన్నాన్నకూ, నాకూ ఉమ్మడి ఆస్తి అయిన మండువా లోగిలి. అదెప్పుడో శిథిలమైంది. చిన్నాన్న వేరే చోట డాబా ఇల్లు కట్టుకున్నాడు. నా పసితనం గడిచిన ఆ పాత కొంపను అమ్మేయాలని ఎప్పట్నుంచో అనుకుంటున్నాను. నాన్నేమో 'దాన్ని అమ్మితే తప్ప గడవని స్థితిలో లేం కదా! ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి బిల్డింగ్ కట్టేందుకు జాగాలేదు. తాతగారి పేరు పెట్టిద్దాం – ఇచ్చేద్దాం రా!' అంటాడు. కప్పూ, గోడలూ కూలి, పెంకులూ, ఇటుకలూ చవుడుబారి, పిచ్చిమొక్కలు పెరిగిన ఆ ఇంటిని అమ్మేసి, ఆ సొమ్మును ఏ బ్యాంకులో వేసినా వడ్డీ వస్తుంది కదా అన్నది నా ఆలోచన. ఊరెళితే పనిలో పనిగా చిన్నాన్నతో ఇంటి విషయం తేల్చేసుకోవచ్చు. అంతగా కావాలంటే తన వాటా దానం చేసుకోమంటాను.

"బయల్దేరే ముందు ఇదే నంబర్‌కు ఫోన్ చెయ్యి. మోటార్ సైకిల్ వేసుకుని నిడదవోలు స్టేషన్‌కు వస్తాను" చెప్పాడు శంకరం.

***

నన్ను చూడగానే వాటేసుకుని "ఎలా ఉన్నావురా రఘూ!" అన్నాడు శంకరం. నాకులాగే వాడికీ బట్టతలొచ్చింది. ముఖంలోకి ముడతలొచ్చాయి. ఎటొచ్చీ నాకున్న బొజ్జా, గడ్డం కింద కొవ్వు సంచులూ లేవు. యాభై ఏళ్ళు దాటినా వాడి కళ్ళలో చిన్నప్పుడు అందరం కలిసి టూరింగ్ టాకీస్‌లో జానపద చిత్రం చూసినప్పటిలా ఆనందం తొణుకుతోంది.


"నువ్వెలా ఉన్నావు" అడిగాను. వాడిలా 'రా' అనడానికి గొంతుకేదో అడ్డం పడుతోంది.

"బాగానే ఉన్నాను. అబ్బాయి వైజాగ్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. అమ్మాయిని మన పక్కూర్లోనే ఇచ్చాను. అమ్మాయికిచ్చింది తప్ప నాకొచ్చిన ఆస్తిని పెంచనూ లేదు, తగ్గించనూ లేదు. మీ పిల్లలేం చేస్తున్నారు?" తన గురించి చెప్పాక అడిగాడు శంకరం.

"అబ్బాయి అమెరికాలో, అమ్మాయి ఆస్ట్రేలియాలో. ఇక నా ఉద్యోగం షరా మామూలే" చెప్పాను.

"చిన్నప్పుడు నిడదవోలొచ్చి సర్వారావు హోటల్లో పెసరట్టు, ఉప్మా తినడమంటే బలే ఇష్టంగా ఉండేది కదా! సర్వారావు పోయాడు గానీ, వాళ్ళబ్బాయి ఇప్పటికీ అదే హోటల్ నడుపుతున్నాడు. వెళ్దామా? అన్నట్టు – నువ్వు పళ్ళు తోముకున్నావా?" అడిగాడు.

"ఆ – ఏలూరు వచ్చేసరికే మెలకువ వచ్చేసింది" చెప్పాను.




సర్వారావు కొడుకునంటూ నవ్వుతూ పలకరించాడు శంకరాన్ని. పొగలు కక్కే పెసరట్టు, ఉప్మాను తిన్నప్పుడు తిరుపతి ప్రసాదాన్ని కళ్ళకు అద్దుకుని తిన్నంత ఆప్యాయంగా తింటున్నాడు శంకరం. బహుశా – చట్నీతో పాటు బాల్యాన్నీ కలుపుకున్నాడేమో! నాతో కలిసి తినడంతో పెసరట్టు రుచి రెట్టింపైందేమో! మాతో పనులున్న వాళ్ళు స్టార్ హోటళ్లలో పార్టీలిస్తుంటారు. దేశ, విదేశీ వంటకాల్లో దేన్నీ నేనంత ఇష్టంగా తినలేదు.

కోడోడి ఇంటికెళ్ళాం. మా చిన్నప్పుడున్న చోటే ఉంది ఆ పూరిల్లు. కాకపోతే మధ్యలో కొన్ని డజను సార్లు కప్పు మారి ఉంటుంది. గోడలకు మెత్త వేసి ఉంటారు.

మమ్మల్ని చూడగానే "శంకరంగారూ! రండి" అంటూ ఆహ్వానించాడో యువకుడు. కోడోడి కొడుకుంటా – వాడి పోలికలతోనే ఉన్నాడు. నావైపు ఆసక్తిగా చూశాడు.

"మా చిన్నప్పటి నేస్తం రఘు. హైదరాబాద్ నుంచి మీ నాన్నని చూడటానికి వచ్చాడు. నిన్న చెప్పాను కదరా!" చెప్పాడు శంకరం. ఇంట్లోకి వెళ్ళాం. ముందు గదిలో నవారు కుంగిన పట్టె మంచంలో పడి ఉన్నాడు కోడోడు. అన్నీ మంచం మీదేననుకుంటా గదిలోకి వెళ్ళగానే వెగటు వాసనకు కడుపులో దేవినట్లైంది.పహిల్వాన్‌లా ఉండే వాడు పోలియో సోకినట్టయిపోయాడు. చేవదేరిన తాటిచెట్టులా ఉండేవాడు నీరందని అరటిమొక్కలా శుష్కించిపోయాడు. పాడుపడ్డ ఇంట్లో పెరిగిన తుప్పల్లా – వయసుకు మించి ముడతలు పడిన ముఖంలో పెరిగిన గడ్డం! విరిగిన సింహద్వారంలా వంకరపోయిన నోరు! మూసుకున్న వాడి రెప్పల వెనక చిన్నప్పటి పంటకాల్వలు తిరిగి మౌనంగా పారుతున్నాయేమో "రేయ్, కోడీ! రఘు వచ్చాడురా!" తట్టిలేపాడు శంకరం.

సుడిగుండం లోపలికి లాక్కుపోయిన పండుటాకులు అనుకోకుండా పైకి తేలినట్టు కోడోడి కనురెప్పలు తెరుచుకున్నాయి. 'దేవదాసు' క్లైమాక్స్‌లో రచ్చబండ మీద కొన ఊపిరితో ఉన్న అక్కినేని 'పార్వతి' అన్న మాట వినగానే యమపాశంతో పెనుగులాడి, ఒంట్లోని శక్తినంతా కళ్ళలోకి తెచ్చుకుని ఆశగా రెప్పలు విప్పిన సన్నివేశం గుర్తుకొచ్చింది. కోడోడి కళ్ళలో దీపావళి రాత్రి చిచ్చుబుడ్డి వెలుగుతున్నట్టు కాంతి. కండ కరిగిపోయి ఎండిన వెదురుబద్దలా మిగిలిన ఎడమచేయెత్తి పిలిచాడు.

"రఘూ! దా దా! ఇలా దా!" కబడ్డీలో నిముషాల పాటు గుక్క తిప్పుకోకుండా కూతపట్టిన నోరది. అతికష్టమ్మీద ఆ నాలుగు అక్షరాలూ పలికేసరికే ఎదుటిజట్టంతా మీద పడి నోరు నొక్కేసినట్టు మూగబోయింది. లేవలేక లేచిన వాడి చెయ్యీ, పలకలేక పలికిన వాడి మాటలూ – వాడి మనసులో నామీదున్న ప్రేమను బయటికి తోడుకొచ్చి వెదజల్లినట్టున్నాయి – గదిలో వెగటు వాసన తోక ముడిచింది. మంచం పట్టెమీద కూర్చుని వాడి నుదుట చెయ్యి వెయ్యకుండా ఉండలేకపోయాను. ఎండిన వాగులోని రెండు గుంతల్లాంటి కోడోడి

కళ్ళనుంచి పాతాళగంగలా ఉబికింది కన్నీరు. ఎడమచేత్తో నా ముఖం, వళ్ళూ తడుముతూ, వంకర బోయిన నోటితో వెక్కెక్కిపడ్డాడు వాడు. వాడి స్పర్శ నాకు అమ్మను గుర్తుకు తెచ్చింది. వాడి రోదన నాకు మానవ హృదయ స్పందనకు కట్టిన బాణీలా వినిపించింది. పక్కనే నుంచున్న శంకరాన్ని చూస్తే వాడి ముఖంలో ఒలింపిక్స్‌లో బంగారు పతకాన్ని సాధించినంత సంబరం! నన్ను చూడగానే కోడోడికీ, వాడి కొడుక్కీ, నన్ను తీసుకొచ్చినందుకు శంకరానికీ ఎందుకంత ఆనందం?

***

కోడోడి ఇంటినుంచి చిన్నాన్న ఇంటికెళ్ళాం. ''రారా రఘూ! ఎప్పుడొచ్చావ్? నేరుగా మనింటికి రాలేదేం?'' నిష్ఠూరంగా అన్నాడు చిన్నాన్న.

''రాగానే శంకరంతో కలిసి కోడోడి ఇంటికెళ్ళి చూసొస్తున్నా'' చెప్పాను.

పిన్ని కాఫీ తీసుకొచ్చింది. తాగుతుండగా అడిగాడు చిన్నాన్న ''ఏరా! పాతింటి సంగతేం చేద్దాం?''

''ఏదో హాస్పిటల్‌కి అడిగారన్నావు కదా, ఇచ్చేద్దాంలే''

లేచొచ్చి భుజం తట్టాడు చిన్నాన్న. భోగీ, దీపావళీ ఒకేరోజు రాగా చలివేకువలో భోగి మంట కాగుతూ, బాణాసంచా కాల్చుకుంటున్న పిల్లాడిలా డెబ్భై ఏళ్ళ ఆ వృద్ధుని ముఖంలో ఆనందం! ఆయన కెందుకంత ఆనందం?

***

సాయంత్రం తిరుగు ప్రయాణమయ్యాను. పడమరన అదే తాటితోపు. అలాగే సూర్యాస్తమయం. వెలుగుల రేడుకు వీడ్కోలు చెపుతున్నట్టు నీరెండలో ఎగురుతున్నాయి తూనీగలు. ఇదంతా చిన్నప్పుడున్నట్టే ఉంది. అచ్చం కొందరు మనుషుల్లాగే మారలేదు.

''దారిలో మా అమ్మాయింటికెళ్ళి అక్కడినుంచి నిడదవోలు వెళదాం. ఫర్లేదు కదా?'' బైక్ నడుపుతున్న శంకరం అడిగాడు.

''అలాగే''

ఊళ్ళను ఊళ్ళుగా గుర్తు పట్టేందుకు పుట్టుమచ్చల్లా ఆ ఊళ్ళో అక్కడక్కడా మిగిలే ఉన్నాయి పెంకుటిళ్ళు. ఓ పెద్ద పెంకుటింటి ముందాపాడు శంకరం. లోపలికి వెళుతుండగా అన్నాడు ''సంధ్య పెళ్ళికి నువ్వు రాలేదు కదా – ఏదో క్యాంపుకెళ్ళాలని చెప్పావు''

నాకు గుర్తేలేదు. అరుగుల మధ్యనున్న మెట్లెక్కి లోపలికెళ్ళాం. విశాలమైన హాల్లో ఏడాదిన్నర వయసుండే పసివాడికి బువ్వ తినిపిస్తోంది శంకరం కూతురు. శంకరాన్ని చూడగానే ఇందాక గుంకిన పొద్దు మళ్ళీ పొడిచినట్టు పసివాడి ముఖం వెలిగిపోయింది. వాడప్పుడు మెరుపులా కదిలాడు. జలపాతంలా దూకాడు. పక్షిలా ఎగిరాడు. పురి విప్పిన నెమలిలా ఊగాడు. లేగదూడలా గెంతాడు. కాచి వడబోసిన వారికయే సరికొత్త పాఠాలు! కొన్ని క్షణాలు అలా తాండవించిన పసివాడు హాలు మధ్యలో అకస్మాత్తుగా నిలబడిపోయాడు. వాడప్పుడు రెండు చేతులూ పైకి సాచి, నడుము వెనక్కి విరిచి, మెడ రిక్కించి, కళ్ళు విప్పార్చి, కాళ్ళు ఎడంగా ఉంచి, పండిన బాదం కాయ డొప్పల్లాంటి ఎర్రటి పెదాలను తెరిచి, తెల్లని గింజల్లాంటి పళ్ళను బయటపెట్టి – ప్రపంచంలోని ఆనందాన్నంతా తనలోకి ఆవాహన చేసుకుంటున్న మనోహరుడైన మాంత్రికుడిలా కనిపించాడు. వాడిన పుడు చూడకపోవడం మహాశిల్పులు చేసుకున్న దురదృష్టం. ఆ భంగిమలో కొన్ని క్షణాలు నిశ్చలంగా ఉండిపోయిన పసివాడు తేనెటీగ పువ్వు కడుపులో దూరినంత హాయిగా తాత ఒడిలో చేరాడు. వాడికెందుకంత ఆనందం?

''త్తాతా! త్తాతా!'' శంకరాన్ని పెనవేసుకుపోయి అంటున్నాడు పసివాడు. అంటూనే నా వంక ఆసక్తిగా చూస్తున్నాడు. శంకరం చెప్పాడు ''హైదరాబాద్ తాతరా!''

''అయిదాబాదు త్తాతా!'' పసివాడు లేత నోటితో వల్లె వేస్తున్నాడు. ఆత్రంగా వాడిని ఎత్తుకున్నాను. తాతతో కలిసి వచ్చానని గురి కుదిరింది కాబోలు – నిరభ్యంతరంగా వచ్చాడు పసివాడు. కాసేపు వాడితో ఆడుకున్నాను. సంధ్యకి నా సెల్‌ఫోన్ ఇచ్చి అదంతా వీడియో తీయించుకున్నాను. ఆనందాన్ని పదిలం చేసుకోవడం మంచి అలవాటే కదా!

పసివాడు శంకరాన్ని ఉద్దేశించి అడుగుతున్నాడు ''త్తాతా! రైలేది?''

''లేదురా – ఈసారి రాజమండ్రి వెళ్ళినపుడు తెస్తా'' వాడిని బుజ్జగిస్తూనే మురిపెంగా నాతో చెప్పాడు ''కూత పెడుతూ, స్టేషన్లలో ఆగుతూ, తిరిగి బయల్దేరే బ్యాటరీ రైలును వీడెవరింట్లోనో చూశాడు. అప్పట్నుంచి కావాలంటున్నాడు. అలాంటిది నిడదవోలులో దొరకడం లేదు''

***

రైలెక్కే ముందు ఏటీఎంకి వెళ్ళి డబ్బు తీసుకున్నాను. శంకరానికిచ్చి ''కోడోడికి ఎప్పుడేమి అవసరమవుతుందో ఉంచు'' అన్నాను.

''అవసరం లేదురా – మేమంతా ఉన్నాంలే. నువ్వొచ్చావు అది చాలు''

''కాదు, కాదు – ఈ డబ్బివ్వడం ఇప్పుడు నా అవసరం'' అంటుంటే నా గొంతు జీరబోయింది. నా చేతిని మృదువుగా ఒత్తుతూ మాట్లాడకుండా డబ్బు జేబులో పెట్టుకున్నాడు.

''బ్యాటరీ రైలు నువ్వు కొనకు. ఏఎన్ఎల్ పార్శిళ్ళో పంపిస్తాను. అయిదాబాదు తాత పంపించాడని చిన్నుగాడికివ్వు. ఇదీ నా అవసరమే'' శంకరం నావైపు అపరిచితుణ్ణి చూసినట్టు చూశాడు. నాకు సిగ్గనిపించింది.

జీవితం ఏపుగా పెరిగి పూతా, పిందే లేని చెట్టులా, రోజులు వేసవిలో ధవళేశ్వరం బ్యారేజి దిగువన ఇసుకదిబ్బల్లా ఎందుకనిపిస్తుందో నాకు అర్థమైందిప్పుడు. కోట్ల రూపాయలు గడించాను. ఇంకొన్ని కోట్లను డాలర్ల రూపంలో వెనకేసుకోవడానికి మాత్రమే కొడుకూ, కూతురూ ఖండాలు దాటి వెళ్ళిపోయారు. ఇలాంటి ఒక్క సాయంత్రాన్నైనా జీవితానికి జమ చేసుకున్నానా? కోడోడి నుంచీ, ఇప్పుడే నడక నేర్చిన శంకరం మనవడి నుంచీ నడవడమెలాగో నేర్చుకోవాలనిపిస్తోంది. మట్టి పొత్తిళ్ళలో ఒదిగి, తడిని పీల్చుకున్నప్పుడే విత్తనం మొలకెత్తుతుంది. మనిషి హృదయాన్ని మనిషి హృదయంతో కూడిక చేసే లెక్కతోనే ఆనందం దక్కుతుంది. కోటీశ్వరుడినైన నేను మనిషిగా ఒకటో ఎక్కం నుంచీ లెక్కలు నేర్చుకోవాలనిపిస్తోంది.

రైలు కదిలింది. ''వెళ్ళొస్తానురా! వీలు చూసుకుని మళ్ళీ వస్తాను'' శంకరాన్ని మళ్ళీ మొదటిసారి 'రా' అన్నాను.

రైలు వేగం పుంజుకుంటోంది. అయితేనేం, చెయ్యూపుతున్న శంకరమే కాదు –ఆ పెంకుటింట్లోని చిన్నుగాడూ, ఊళ్ళోని కోడోడూ, వాడి కొడుకూ, చిన్నాన్నా. ఊరూ నాకు దగ్గరవుతున్నట్టు అనిపిస్తోందిప్పుడు.

*

## ఎదురీత రచయిత కర్తవ్యం



30 ఏళ్లకు పైనుంచి కథలు, కవిత్వం రాస్తున్నా. 'వి–రాగి' కలం పేరుతో ఎక్కువగా రాశా. ఇంతవరకూ చెప్పుకోదగ్గవేమీ రాయలేదన్నది నా సాహిత్య కృషి గురించిన సొంత అంచనా. రచయితలు రైతుల వంటివారు. గంజాయి, పొగాకు పండించ కూడదన్నది మొదటి షరతుగా ఉండాలనుకుంటాను. జీవన, మనోవికాసాలకు దోహద పడడమే అక్షర సేద్యానికి లక్ష్యమనుకుంటాను. ప్రపంచీకరణ నీడ మాటున పండుటాకుల నుంచి చిగురాకుల వరకు గిడసబారుస్తున్న కాలమిది. అడుగడుగునా విలువలు ఖండఖండాలవుతున్న బీభత్స సమయమిది. ఈ పతన సునామీకి ఎదురీదడమే రచయిత ప్రథమ కర్తవ్యమనుకుంటాను.

'అసలైన లెక్క'కు బీజం ఆ కథలో వర్ణించిన ఓ ఘట్టమే! తాతను చూసి మనవడు చేసిన ఆనంద తాండవం నా స్వానుభవమే! ఓ పండక్కి మేమంతా వెళ్ళినప్పుడు నా మనవడు చేసిన అద్భుత విన్యాసాలు నాలో ఆలోచన రేకెత్తించాయి. మనుషుల్ని చూసి మనిషి ఇంతగా ఆనందించవచ్చా అనిపించింది. వాడి విన్యాసాలను కళ్ళకు కట్టించడంలో నేను సఫలుణ్ని కాలేకపోయాను.

**–యు.సూర్యచంద్రరావు (వి–రాగి)**

***85–18–2, ప్లాట్ నెం. 42ఎ, ఆల్ బ్యాంక్ కాలనీ,***

***రాజమండ్రి – 533 103. సెల్: 766 35017***